పెద్దాసుపత్రికి దీటుగా డోన్ హాస్పిటల్!

- పదెకరాల విస్తీర్ణంలో రూ.40కోట్లతో వందపడకల భవనం
- సకల వసతులతో చురుగ్గా సాగుతున్న ఆసుపత్రి నిర్మాణం
- నాలుగు దిక్కులా ఒకేవిధంగా రూపుదిద్దుకుంటున్న వైనం
- ఇప్పటికే వైద్యులతో పాటు 96 పోస్టుల మంజూరు


వంద పడకల ఆసుపత్రి నమూనా


రూ.40కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వాసుపత్రి

డోన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి అత్యంత ప్రాధాన్యనిస్తుంది. ప్రజల ముంగిటకే సకల వైద్య సేవలను తీసుకొస్తుంది. ఆసుపత్రుల స్థాయి, ఆరోగ్యశ్రీ పరిధిని పెంచడంతో పాటు విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు, ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ల కాన్సెప్ట్‌ను అమలు చేస్తుంది ప్రభుత్వం. దివంగతనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రూ. కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డోన్ ప్రభుత్వాసుపత్రిని వంద పడకల హాస్పిటల్‌గా స్థాయి పెంచారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.40కోట్లతో స్థానిక గుత్తిరోడ్డు ప్రక్కన చేపట్టిన కొత్త భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

సకల వసతులు:
పదెకరాల విస్తీర్ణంలో రెండతస్తుల భవనంలో సకల వసతులు కల్పిస్తున్నారు. వసతులతోపాటు భవనం కర్నూలు పెద్దాసుపత్రికి దీటుగా చేపడుతున్నారు. భవనం నాలుగు దిక్కులూ ఒకే విధంగా ఉండేలా అత్యాధినక పద్ధతిలో రూపకల్పన చేశారు. రోగుల రాకపోకల కోసం నాలుగు ప్రధాన రహదారులు ఉన్నాయి. రెండు లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఆధునిక వసతులతో నిర్మిస్తున్న ఈ ఆసుపత్రికి కావాల్సిన ఫర్నీచర్‌తో పాటు వైద్యుల పోస్టులు ఇప్పటికే మంజూరయ్యాయి. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూ రక్తపరీక్షల ల్యాబ్‌లు, ఎక్సరే యూనిట్లు అందుబాటులోకి రానున్నాయి. మెదడు, ఎముకలు, ఊపిరితిత్తులు, నరాలు, కిడ్నీలు, గుండె, లివర్, క్యాన్సర్, చెవి , ముక్కు, గొంతు, చర్మ తదితర అన్ని వ్యాధులకు చికిత్స నిర్వహించే అవకాశం ఉంది. అత్యాధునిక వసతులతో ఆక్సిజన్ ప్లాంట్ కూడా ఇప్పటికే ఏర్పాటు చేశారు. పిల్లలు మరియు కాన్పుల కోసం వార్డులు రూపుదిద్దుకొంటున్నాయి. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో వంద పడకల ఆసుపత్రితో పాటు నర్సింగ్ కళాశాల కూడా ఇక్కడ ఏర్పాటు కానుంది.

అన్ని పోస్టులు మంజూరు
మంత్రి బుగ్గన ప్రత్యేక చొరవతో వంద పడకల ఆసుపత్రికి అనుగుణంగా అన్ని పోస్టులు ఇప్పటికే మంజూరయ్యాయి. సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ 6, డిప్యూటీ సివిల్ సర్జన్లు 15, డెంటల్ 2, హెడ్ నర్సులు 1, స్టాఫ్ నర్సులు 12, నర్సింగ్ సూపరింటెండెంట్ 1, రేడియోగ్రాఫర్ 1, ఫార్మాసిస్ట్ సూపర్‌వైజర్ 1, ఫార్మాసిస్టు 5, ఫార్మాసిస్ట్ గ్రేడ్ 2 పోస్టులు 4 పోస్టులు మంజూరయ్యాయి. అదేవిధంగా థియేటర్ అసిస్టెంట్ 4, ల్యాబ్ టెక్నిషియన్ 3, డార్కురూం అసిస్టెంట్ 3, బయోమెడికల్ ఇంజనీర్, ఆడియో మెట్రిక్ టెక్నిషియన్, ల్యాబ్ అటండెంట్, ఫిజియో థెరపిస్ట్, కౌన్సిలర్, పోస్టుమార్టం అసిస్టెంట్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్, అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ 1, ఆఫీస్ సూపరింటెండెంట్ 1, జూనియర్ అటెండెంట్ 3, జూనియర్ ఏసీపీ 1, సీనియర్ అసిస్టెంట్ 2, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ 10, ప్లంబర్ 1, ఎలక్ట్రీషియన్ 1, ఆఫీస్ సబార్డినేట్ 1 పోస్టుతో పాటు మరో 20 అదనపు పోస్టులతో మొత్తం 96 పోస్టులు ఇప్పటికే కేటాయించింది ప్రభుత్వం.

గతంలో సరైన వైద్యం అందక...



44వ జాతీయ రహదారి ఉండటం, పారిశ్రామిక ప్రాంతం కావడం, అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి సరైన వైద్యం సకాలంలో అందక చాలామంది మత్యువాత పడ్డారు. అయితే వంద పడకల ప్రభుత్వాసుపత్రి అందుబాటులోకి రానున్నందున అన్ని వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. సకాంలో సరైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడవచ్చు.
– రేగటి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ, డోన్.

సకల సేవలు ఉచితం



ప్రస్తుతం 500 వరకు ఉన్న ఓపీ మెయ్యికి చేరే అవకాశం ఉంది. ఇక్కడి వంద పడకల ఆసుపత్రితో తొమ్మిద మండలాల ప్రజలకు సకల వైద్య సేవలు ఉచితంగా అందనున్నాయి. ప్రతి నెలా ప్రస్తుతం జరుగుతున్న ప్రసవాల సంఖ్య 200 నుండి వెయ్యి వరకు జరిపే అవకాశం ఉంది. వంద పడకల ఆసుపత్రిలో అన్ని విభాగాలకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. – డాక్టర్ రమ్యశిల్ప, సీనియర్ గైనకాలజిస్ట్, ప్రభుత్వాసుపత్రి, డోన్.

అత్యంత ఆధునిక వసతులు



అత్యంత ఆధునికి వసతులతో వందపడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణం జరుగుతుంది. వైద్య సేవలు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఉంటాయి. మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేపడుతున్న అభివద్ధి పనులు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. –గోకుల్ లక్ష్మి, ఎంపీపీ, ప్యాపిలి.

క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లెరూరల్: మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన శ్రీ పెద్దమ్మ గుడి అభివృద్ధికి మంగళవారం గోస్పాడు గ్రామానికి చెందిన కూరాకుల వెంకటసుబ్బయ్య, దస్తగిరమ్మ దంపతుల కుమారుడు కూరాకుల వెంకటరమణ రూ.45వేల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. అమ్మరికి ప్రత్యేక పూజల అనంతరం దాతకు కమిటీ సభ్యులు పెద్దమ్మ తల్లి చిత్రపటాన్ని అందజేశారు.

17 నుంచి సీపీఐ సమర భేరి యాత్ర

డోన్ టౌన్ : నంద్యాల జిల్లాలో వెనుకడిన డోన్ నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించి హంద్రీనీవా చెరువులకు నీటిని నింపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల17 నుంచి 22వ తేదీ వరకు సీపీఐ ఆధ్వర్యంలో బేతంచెర్ల మండలం సిమెంట్ నగర్ నుంచి సమర భేరి యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగ నాయుడు తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కారం అవ్వాలన్నా, వలసలు నివారించాలన్నా పరిశ్రమలు నెలకోల్పి అందులో 75శాతం స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.

కేసు నమోదు చేయలేదని నిరసన

బనగానపల్లె: బనగానపల్లె పోలీసు స్టేషన్ పరిధిలోని చిన్నరాజుపాళెంతండా గ్రామానికి చెందిన మిట్యానాయక్ తాను ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేయాలేదని ఆరోపిస్తూ మంగళవారం స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మిట్యానాయక్ మాట్లాడుతూ తమ పొలం వద్ద సోమవారం సాయంత్రం నాతోపాటు భార్య చంద్రభాయి ఉండగా పక్కపొలానికి చెందిన స్వామినాయక్, అశోక్ నాయక్, పాములేటినాయక్‌పై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నామన్న అనుమానంతో దాడికి పాల్పడ్డారన్నారు. వేటకొడవళ్లతో వెంటబడి కారంపొడి చల్లి హతమార్చేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయడంలేదని పేర్కొన్నారు. అయితే మిట్యానాయక్ ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని బలపాలపల్లె , పాపసాని కొట్టాల గ్రామాల మధ్యన మంగళవారం ఆవు అడ్డు రావడంతో ద్విచక్రవాహనం బోల్తాపడి ఇద్దరికి గాయాలయ్యాయి. తవిసికొండ గ్రామానికి చెందిన సుధాకర్, మహేష్ బేతంచెర్లకు పని నిమిత్తం వచ్చి ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సుధాకర్ కు తీవ్రగాయాలు కాగా మహేష్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం బేతంచెర్ల శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు.

రైతుల విన్నపాలను పరిగణలోకి తీసుకుంటాం

బేతంచెర్ల: పంట పొలాలకు వేసే రహదారులకు సంబంధించి రైతుల విన్నపాలను పరిగణలోకి తీసుకుంటామని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. మండలపరిధిలోని కొమ్మురికొట్టాల గ్రామంలో పొలాలకు వేసే మట్టి రోడ్డుకు రైతుల విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు కావడంతో పనులు చేపట్టారన్నారు. అయితే రైతు దాసరి రవి కుమార్ తన పొలంలో కాలి బాట మాత్రమే ఉందని, రహదారి ఆపాలని నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ రైతులు, బాధిత రైతు దాసరి రవితో మాట్లాడటం జరిగిందని తహసీల్దార్ తెలిపారు. సంబంధింత రహదారిని పరిశీలించి రైతుల అభిప్రాయాలను పరిగలోకి తీసుకుని రహదారి వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంగన్న, డీటీ సత్యదీప్, పంచాయతీ రాజ్ ఇంజనీర్ గణేష్, మండలసర్వేయర్ జ్యోష్న, ఆర్‌ఐ శ్రీదేవి, వీఆర్వో కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సుంకులమ్మకు బోనాలు

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్, హనుమాన్ నగర్ కాలనీలకు చెందిన మహిళలు గొరిపేటలో వెలసిన సంకులమ్మకు మంగళవారం సామూహికంగా బోనాలు సమర్పించారు. మంగళవాయిద్యాల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. కార్యక్రమంలో కాలనీవాసులు నాగరాజు, రామనాయుడు, కేశాలు, వనుము రామచంద్రుడు, తిమ్మరాజు, మల్లికార్జున పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్‌అండ్‌బీ రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. మండలంలోని జోళదరాశి గ్రామానికి చెందిన దస్తగిరి బైక్‌పై కోవెలకుంట్లకు వస్తుండగా పట్టణ శివారులో బైక్ అదుపు తప్పింది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

18లోపు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

సంజామల: రైతుభరోసా పథకానికి అర్హులైన రైతులు ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సుధాకర్‌రెడ్డి సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే ఆర్బీకేల్లో సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మా పొలాలకు రస్తా ఏర్పాటు చేయాలి


ఆర్డీఓ, తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కొమ్మూరి కొట్టాల గ్రామస్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని కొమ్మూరి కొట్టాల రైతులు తమ పొలాలకు రస్తా ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం ఆర్డీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.గ్రామస్తులు తిమోతి, రాముడు, శ్రీరాములు, సోమన్న, సాలన్న, గోపాలు, మద్దిలేటి, లక్ష్మీదేవి, శీనమ్మ, భూ లక్ష్మి మాట్లాడుతూ మా పొలాలు కొండ ప్రాంతలో ఉన్నాయన్నారు. 2015లో పొలాల రహదారికి అందరూ కలిసి అగ్రిమెంట్ రాసుకొని ప్రభుత్వ అధికారులకు రహదారి ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇచ్చామన్నారు. ప్రస్తుతం గ్రామ పొలాల రహదారికి రూ. 20 లక్షలు మంజూరు కావడంతో పనులు చేపట్టారన్నారు. అయితే గ్రామానికి చెందిన దాసరి రవితో పాటు మరి కొంత మంది రాజకీయ కారణాలు, వ్యక్తిగత కక్ష్యలతో రహదారి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిని పరిశీలించి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హామీ ఇచ్చారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి


కోవెలకుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోవెలకుంట్ల: డెంగీ జ్వరంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురష్కరించుకుని మంగళవారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమల కారణంగా మలేరియా, చికున్‌గున్యా, డెంగ్యూ, తదితర ప్రాణాంతక జ్వరాలు ప్రబలే ఆస్కారం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. అలాగే మండలంలోని రేవనూరు, మాయలూరు పీహెచ్‌సీల పరిధిలో డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్ సుభాని, రాబర్ట్‌కెన్నెడి ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురష్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ విశ్వనాథ్, హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, వీరభద్రుడు, గిరిజ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: డెంగీవ్యాధి పట్ల ప్రజలు అప్రత్తంగా ఉండాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అప్పలాపురం గ్రామంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ అయ్యమ్మ, ఎంపీహెచ్ఓ వెంకటేశ్వర్లు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఏఎన్ఎమ్‌లు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రతను పాటించాలని ఈ సందర్భంగా వైద్యురాలు ప్రియారెడ్డి సూచించారు.

అవుకు: ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ అజాంఖాన్ సూచించారు. మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం అవుకులో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ అశ్విన్ కుమార్, పీహెచ్ఎన్ మల్లీశ్వరి, సూపర్‌వైజర్లు తెరిసమ్మ, దానమ్మ, ఏఎన్ఎంలు వెంకటేశ్వరమ్మ, దానమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థానం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


మార్కెట్‌యార్డు నూతన పాలక మండలి సభ్యులతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని సమాజికవర్గాలకు న్యాయం చేస్తున్నారని, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. బనగానపల్లె మార్కెట్ యార్డులో మంగళవారం సెక్రటరీ సుందర్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన యార్డు నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్‌గా దీవెనమ్మ, ఉపాధ్యక్షుడిగా సన్నల జనార్ధన్‌రెడ్డితోపాటు బండిగారి వెంకటయ్య, దూదేకుల పాపన్న, కోనేటి కోత్తురమ్మ, గోల్ల జయమ్మ, ఎం ఇమాంఖాసీం, జీ పెద్దహుస్సేబై, నూకలవిశాలక్ష్మీ, గాలివీరారెడ్డి, బెల్లం సుబ్బరాయుడు, లింగాల వెంకటలక్ష్మమ్మ, షేక్ మౌలానిబీ, గోల్ల బాల తిమ్మయ్య, తులసిరెడ్డిగారి సుహాషిణి, నీలి శ్రీనివాసులు, పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజకీయంగా అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. నామినేటెడ్, కార్పొరేషన్ పదవుల్లో చైర్మన్లు, డైరెక్టర్లుగా నియమించి తగిన న్యాయం చేయడం జరిగిందని, ముఖ్యంగా మహిళలకు ఎక్కువ శాతం పదవు లను కేటాయించి ప్రోత్సహిస్తున్నారని గుర్తు చేశారు. సీఎం రైతు పక్షపాతి అని, ధరల స్థిరీకరణ పథకం ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎక్కడ లేని విధంగా బనగానపల్లె నియోజకవర్గంలో కోవెలకుంట్ల, బనగానపల్లె మండలాల్లో మార్కెట్ యార్డులు ఉండడంతో ఇక్కడి రైతులకు ఎంతో ఉపయోగమన్నారు. మార్కెట్ యార్డుకు వచ్చిన నిధులతో మండలంలోని కాలేనాయక్‌తాండా, చెర్లోకొత్తూరు, అవుకు మండలంలోని సుంకేసుల గ్రామాలకు తారు రోడ్డు వేయడం జరిగిందన్నారు. అలాగే రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ ఉంచుకునేందుకు బనగానపల్లెలోని రవ్వల కొండపై గిడ్డంగి నిర్మాణం పూర్తయిందని, మరో గిడ్డంగి నిర్మాణానికి రూ.74లక్షల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాటసాని ప్రసాదరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ నిత్యం ప్రజల మధ్య ఉండి కష్ట పడే నాయకుడని, ఆయనను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అంతకుముందు పునః నిర్మించిన మార్కెట్‌యార్డు కమిటీ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ ఆఫీసర్ అబ్దుల్ రహీమాన్, ఎంపీడీఓ శివరామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలూరు వెంకట సుబ్బయ్య, బాలు, నూకలవెంకటసుబ్బయ్య, రామసుబ్బయ్య, ఈశ్వర్‌నాయక్, నారాయణ, నూకల విజయకుమార్, సురేష్, ప్రసాద్, పసుపల సర్పంచ్ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లీ చల్లంగా చూడమ్మా...


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కమ్మవారిపల్లెలో దాదాపు 49 ఏళ్ల తర్వాత నిర్వహించిన పెద్దమ్మ తల్లి దేవర అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా తయారు చేసి గ్రామం మధ్యలో ప్రతిష్ఠించారు. ఈ మేరకు మంగళవారం ప్రతి ఇంటి నుంచి బోనాలు మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లకు కలియతిరిగారు. ప్రతి ఇళ్లు బంధువులు, స్నేహితులతో కోలాహాలంగా మారాయి. సీఐ నారాయణరెడ్డి ఆధ్వ ర్యంలోబందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమ స్య తలెత్తకుండా గ్రామం వెలుపలే బారికేడ్లు ఏర్పా టు చేసి వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్య దర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ కొండయ్య, నాయకులు నాగేశ్వరరావు, రంగయ్య, చంద్రోశేఖర్‌రెడ్డి, రామ్మోహన్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

21న ఉచిత మెడికల్ క్యాంప్

డోన్ : ఈనెల 21వ తేదీన డోన్ మునిసిపాలిటీ, కర్నూలు విశ్వభారతి మెడికల్ కాలేజ్ వారు సంయుక్తంగా ఉచిత మెగా మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం కౌన్సిలర్లు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ఈ మెగా మెడికల్ క్యాంపులో 11 రకాల వ్యాధులకు సంబంధించి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని, 22 మంది డాక్టర్లు పాల్గొంటారని తెలిపారు. వ్యాధి నిర్ధారణై శస్త్రచికిత్సలు అవసరమైన కర్నూలులోని ఆసుపత్రులకు ఉచితంగా బస్సుల్లో తీసుకువెళతారన్నారు. శస్త్ర చికిత్సలతో పాటు రోగి సహాయకులకు ఉచిత భోజన వసతి కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్ కటికె వేణు, పట్టణ సచివాలయాల కన్వీనర్ కురుకుంద హరి, కమిషనర్ వెంకటేశ్వర్లు, టీపీఎస్ అంజాద్‌బాషా, వైఎస్సార్‌సీ నాయకులు వంశీ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలి

ప్యాపిలి: మండల స్థాయి అధికారులు ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ గోకుల్‌లక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు సమర్పించారు. ప్యాపిలి బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణతా శాతం పడిపోవడంపై జెడ్పీటీసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తరచూ పాఠశాలను సందర్శించి ఉత్తీర్ణతశాతం పెంచాల్సిన బాధ్యత ఎంఈఓ తీసుకోవాలన్నారు. మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి పశువైద్య సిబ్బంది హాజరు కావడం లేదని గ్రామ సర్పంచ్ పద్మావతి తెలిపారు. పశువైద్య సిబ్బంది తమ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండాలని జెడ్పీటీసీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, తహసీల్దార్ చంద్రశేఖర వర్మ, ఈఓఆర్డీ బాలకృష్ణుడు, ఏపీఓలు రమణ, నర్సిరెడ్డి, వ్యవసాయాధికారి షేక్షావలి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ప్రభాకర్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు


సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ప్యాపిలి: గడప గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జున రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఊటకొండ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఎంపీటీసీ మద్దయ్య ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల్లో అర్హులైన అందరూ లబ్ధి పొందాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శింబిరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, ప్రకాశ్ రెడ్డి, వీరభద్రాచారి, సుధాకర్, కోటేశ్వరరావు, అరుణ్,సుంకన్న, సుదర్శన్, ఎలిసమ్మ, సంజమ్మ, చిన్న దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: రాష్ట్రంలో సంక్షేమ పాలన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సంగపట్నంలో మంగళవారం ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంగపట్నం చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు క్రేన్ ద్వారా గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు బ్రోచర్‌లో పొందపరిచిన విధంగా సంక్షేమ పథకాలు అందాయా లేదా లబ్ధిదారులను అడిగి తెలుసుకుంటూ.... సమస్యలపై ఆరా తీస్తూ కాటసాని ముందుకు సాగారు. లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రజా సంకల్ప పాదయాత్ర ద్వారా పేదల కష్టాలను తెలుసుకొని నవరత్నాల ద్వారా అనేక సంక్షేమ పథకాలను అందించి ఆదుకుంటున్నారని తెలిపారు. అంతేకాకుండా సచివాలయాల ద్వారా ఎన్నో ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఎంపీడీఓ అజాంఖాన్, డిప్యూటీ తహసీల్దార్ పోతుల ప్రసాద్ రావు, ఈఓఆర్డీ రామక్రిష్ణవేణి, ఏఈలు పక్కీరయ్య, క్రిష్ణారెడ్డి, డాక్టర్ ఐశ్వర్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ, ఏపీఎం విజయగోపాల్, అవుకు మండల సచివాలయ కన్వీనర్ తల్లం సుబ్రహ్మణ్యం , వైఎస్సార్‌సీపీ నాయకులు ముక్కమళ్ల పుల్లారెడ్డి, చందాల ఆంజనేయులు, దస్తగిరి నాయుడు, లింగన్న, పెద్ద కంబయ్య, కురుమయ్య, రాముడు, బాలాంజనేయులు, ఇమాంసా, తప్పెట పెద్దరాముడు, చిన్న రాముడు, నాగరాజు, పురుషోత్తం నాయుడు, పేరం వెంకటసుబ్బారెడ్డి, రేగటి రామ సుబ్బారెడ్డి, పాలనాగిరెడ్డి, గిరి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం..
సంగపట్నం గ్రామంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హామీ ఇచ్చారు. పెన్షన్ అందటంలేదని, వైఎస్సార్ చేయూత రావటంలేదని, పాదుపులో సున్నావడ్డీ వర్తించలేదని మహిళలు ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన కాటసాని వెంటనే సంబంధిత అధికారులను పిలిచి అర్హత ఉండి కూడా చిన్న చిన్న కారణాల వల్ల పేదలకు లబ్ధి ఆగకూడదని, మరోమారు పరిశీలించి న్యాయం చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామంలో పలు చోట్ల అంతర్గత రోడ్లు లేక పలు కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు విన్నవించారు. త్వరలోనే రోడ్ల నిర్మాణాలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు.

కళాశాల అభివృద్ధికి సహకారం

కొలిమిగుండ్ల: ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులుతో పాటు అధ్యాపకులు స్థానిక కార్యాలయంలో జెడ్పీ చైర్మన్‌ను కలిసి కళాశాలలో నెలకొన్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ఎక్కువ మంది బాలికలు కళాశాలకు వస్తుంటారని, ప్రత్యేకించి వారి కోసం హాస్టల్ సౌకర్యం ఏర్పాటు చేస్తే సంఖ్య పెరుగుతుందని ప్రిన్సిపాల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా ఆ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో కొలిమిగుండ్లలో పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలు వచ్చే అవకాశం ఉన్నందున, బాలికల కోసం హాస్టల్ మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు.

సంతకాల సేకరణ

బనగానపల్లెరూరల్: రాయలసీమకు నీళ్లు, నిధుల కేటాయింపులో సమాన వాటా కావాలని కోరుతూ రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ప్రధాన రోడ్లతో నాయకులు ప్రజల సంతకాల సేకరణ చేపట్టారు. కమిటీ నాయకులు సీమకృష్ణ మాట్లాడుతూ అప్పర్ ప్రాజెక్టు నిర్మిస్తే రాయలసీమకు హెచ్ఎల్‌సీ, భైవరవానితిప్ప ప్రాజెక్టు, కేసీ కెనాల్‌కు నీళ్ల రావన్నారు.దీంతో రాయలసీమ ఎడారికి మారుతుం దన్నారు. కార్యక్రమంలో నాయకులు రాము, గంగాధర్, గోపాల్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.